
సాక్షి బాపట్ల

గురువారం । 7 । ఆగస్టు । 2025



ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బాపట్ల అర్బన్: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీసీ సంక్షేమశాఖ డీడీ శివలీల పేర్కొన్నారు. ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను బుధవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 587.70 అడుగులకు చేరింది. ఇది 305.9222 టీఎంసీలకు సమానం.




కొండలమ్మ ఆదాయం రూ.17.75 లక్షలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మవారి దేవస్థానంలో హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించగా రూ.17,75,841 వచ్చాయి.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్త

- అధికారులతో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశం



బాపట్ల: సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల నివారణకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రణాళిక ప్రకారం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని తెలిపారు. నగరం మండలంలో, ఈదుపల్లి గ్రామంలో డెంగీ బాధితుడు మృతి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. డెంగీ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇల్లు, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లోని నీటి డ్రమ్ములు, ఇతరాలపై మూతలు ఉండేలా చూడాలని చెప్పారు. ఈ మేరకు ప్రజలకు కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీపీఓ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, మండల ప్రత్యేక అధికారులు, డీఎల్‌డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగళగిరిలో సీఎం పర్యటన




మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న వీవర్స్ శాల వద్ద జరుగనున్న జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వీవర్స్ శాల ఎదురుగా ఏర్పాటు చేయనున్న ప్రజావేదిక వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. సంయుక్త కలెక్టర్ భార్గవతేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎఫ్‌ఓ కృష్ణారెడ్డి, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ జేడీ రాజారావు, మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబరులో కృత్రిమ చేతులు పంపిణీ



మంగళగిరి టౌన్: మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో ఉచిత కృత్రిమ చేతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం డిగ్రీ కళాశాలలో బుధవారం దీనికి సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతతో జర్మనీ దేశంలో కృత్రిమ చేతులు తయారు చేయించి ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రామ్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ చక్రవర్తి, అన్నే రత్నప్రభాకర్, సెక్రటరీ నిరంజన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,004 క్యూసెక్కులు బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 300, బ్యాంక్ కెనాల్‌కు 1,917, తూర్పు కాలువకు 722, పశ్చిమ కాలువకు 286, నిజాపట్నం కాలువకు 463, కొమ్మూరు కాలువకు 3,160, బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 25,375 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు

కూటమి నేతలకు పొగాకు సెగ

రైతుల వద్ద ఉన్న బ్లాక్‌బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. తూతూమంత్రంగా కొని చేతులు దులుపుకొంది. రైతులు తెచ్చిన పొగాకును నాణ్యతాలోపం సాకుగా చూపి మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల నుంచి వెనక్కు పంపుతోంది. పాలకులు ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కూటమి పార్టీల నేతల తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రపు కొనుగోళ్లతో మాయ చేస్తున్నారని రైతుల ఆగ్రహం

- రైతుల వద్ద పూర్తిగా పొగాకు కొనుగోలు చేయని కూటమి ప్రభుత్వం
- నాణ్యత లేదంటూ వెనక్కి తిప్పి పంపుతున్న అధికారులు
- బాపట్లలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- తీవ్ర నిరసన తెలిపిన అన్నదాతలు
- ప్రభుత్వంతో మాట్లాడతానంటూ జారుకున్న మాధవ్
- ఇప్పటికే 15 చోట్ల కొనుగోలు కేంద్రాలు మూసివేత
- మార్క్‌ఫెడ్ ఇప్పటివరకు కొన్నది కేవలం 7 వేల టన్నులే
- ఇంకా రైతుల వద్దే 40 వేల టన్నుల పొగాకు నిల్వలు
- నమ్మించి నట్టేట ముంచుతున్న సీఎం చంద్రబాబు



కొనుగోలు కేంద్రంలో పొగాకును పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పొగాకు రైతుల నుంచి కూటమి నాయకులకు నిరసన సెగ తప్పడం లేదు. బుధవారం బాపట్లకు వచ్చిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ బాపట్లలోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. బీజేపీ అధ్యక్షుడిని చూసిన రైతుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వం సక్రమంగా పొగాకు కొనడం లేదని, నాణ్యతాలోపం సాకుగా చూపి చెక్కులు తిప్పి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతు తెచ్చిన పొగాకులో మూడవ వంతు కూడా కొనడం లేదని ఆరోపించారు. పండించిన మొత్తం కొంటామన్న ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చి అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధ్యక్షుడి ముందే నిరసనకు దిగారు. ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రోడ్డెక్కి ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అటు కంపెనీలు కొనక, ఇటు ప్రభుత్వం తీసుకోక పంట ఎలా అమ్ముకోవాలని బీజేపీ అధ్యక్షుడిని నిలదీశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పి అక్కడి నుంచి మాధవ్ జారుకున్నారు.

మొక్కుబడిగా కొనుగోళ్లు

రైతులు ఎంత విస్తీర్ణంలో బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేసినా కొంటామన్న కంపెనీలు డిమాండ్ లేదన్న సాకు చూపి మోసం చేశాయి. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొంటామని ప్రభుత్వం తరఫున మంత్రి అచ్చెన్నాయుడు ఆర్భాటంగా ప్రకటించారు. తర్వాత జిల్లాలో ఒక్కొక్కటి చొప్పున మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతుల వద్ద 80 వేల టన్నులకు పైగా బ్లాక్‌బర్లీ పొగాకు ఉండగా... 14 వేల టన్నులు మాత్రమే కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా తొలుత 27 కేంద్రాలు పెట్టిన మార్క్‌ఫెడ్ ఇప్పటికే 15 మూసివేసింది. కొనుగోలు కేంద్రాల పరిధిలోని గోదాములు నిండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 4,500 మంది రైతులకు చెందిన 7 వేల టన్నుల పొగాకు కొన్నట్లు తెలిపారు. లక్ష్యం మేరకు మరో 7 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేయనున్నారు. ఇంకా రైతుల వద్ద 40 వేల టన్నులున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

వానలతో మరిన్ని కష్టాలు

ఇప్పటికే వర్షాకాలం మొదలై వానలు కురుస్తున్నాయి. చాలామంది రైతులు ఉన్న పొగాకును దాచుకునే వీలులేక పొలాల్లోనే టార్పాలిన్ పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. కొన్నిచోట్ల వర్షానికి చాలావరకు పొగాకు తడిసి పాడైపోయింది. నాణ్యతగా ఉంటేనే పొగాకును కొనేందుకు ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోంది. ఇక పాడైన పొగాకును కొనే పరిస్థితి అసలు లేదు. కూటమి సర్కారు వైఖరిపై రైతులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

‘ఉపాధి’ పథకంలో రూ.కోట్లు స్వాహా



బల్లికురవలో అవినీతిపై ఏపీఓను ప్రశ్నిస్తున్న పీడీ విజయలక్ష్మి

- బల్లికురవలో డ్వామా పీడీ విజయలక్ష్మి అసహనం
- చనిపోయిన వారికి, ఉద్యోగుల పేరిట మస్టర్లు వేసి నగదు కాజేసిన సిబ్బంది

బల్లికురవ: ఉపాధి హామీ పథకం ఉన్నత లక్ష్యానికి అవినీతి మకిలి అంటుకుంటోంది. రూ.కోట్లను దర్జాగా కాజేసిన వ్యవహారంపై అంతా విస్తుపోతున్నారు. ప్రభుత్వం వలసలను నిరోధించి ప్రతి కూలీకి పని కల్పించాలన్న ధ్యేయంతో ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని బల్లికురవ మండలంలో అవినీతిమయం చేశారని బాపట్ల జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి అసహనం వ్యక్తం చేశారు. పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు ఏపీఓ కార్యాలయాలకే పరిమితం కావడం వల్లే అవినీతి చోటుచేసుకుందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రూ. 12 కోట్లతో జరిగిన 645 పనులకు సంబంధించి బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఎన్నో విషయాలు బహిర్గతమయ్యాయి.

అడ్డగోలుగా మస్టర్లు

ఎస్‌ఆర్‌పీలు తులసీ నాయక్, సుధీర్‌కుమార్, ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్ సునీల్ పర్యవేక్షణలో డీఆర్‌పీలు జూలై 18 నుంచి 31వ తేదీ వరకు 21 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు, గ్రామ సభలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఉపాధి సిబ్బంది చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, చదువుకునే విద్యార్థులు, చనిపోయిన వారికి, ప్రజాప్రతినిధులకు మస్టర్‌లు వేశారని తేలింది. మొక్కలు పెంపకం చేపట్టినట్లు రికార్డులో చూపారని వెల్లడైంది. ఆ గ్రామాల్లో ఒక్క మొక్క కూడా కనిపించలేదని తనిఖీ బృందాలు గుర్తించాయి. ప్రతి పంచాయతీలో రూ. 20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అవినీతి జరిగినట్లుగా గుర్తించారు. మల్లాయపాలెం మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ 70 మందికి బోగస్ మస్టర్ వేసి రూ. 20 లక్షల మేర స్వాహా చేశారని కలెక్టర్‌కు డ్వామా పీడీ ఫిర్యాదు చేశారు. అనంతరం జూలై 30వ తేదీన సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డి కొమ్మినేనివారిపాలెం, వైదన ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. గతంలో చేపట్టిన పనులనే తిరిగి చేసినట్లు రికార్డుల్లో చూపి అవినీతికి పాల్పడ్డారని గుర్తించారు. 21 పంచాయతీలో అవినీతిపై నివేదికలను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రజావేదిక రాత్రి 7 గంటల వరకు సాగింది. కొప్పరపాలెం, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం గ్రామాల పనులపై విచారణ పూర్తి అయ్యేందుకే 8 గంటల సమయం పట్టింది.

అన్ని పంచాయతీల్లో విచారణ చేపట్టాలి

బల్లికురవ మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో రూ. 3 కోట్ల మేర అవినీతి జరిగిందని.. అన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు బుధవారం పీడీకి వినతి పత్రం అందజేశారు. మిగిలిన 18 పంచాయతీలలో కూడా విచారణ తర్వాత ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన వారి నుంచి రికవరీ చేయాలన్నారు. వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో కుసుమకుమారి, పంచాయతీ రాజ్ ఏఈ మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల ‘నేత’... కన్నీటి వెత



గుంట మగ్గం నేస్తున్న కార్మికుడు

- చేనేత కార్మికులపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- నానాటికీ తీవ్ర ఇబ్బందుల్లోకి నేతన్నలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

చీరాల: అగ్గిపెట్టెలో పట్టేలా పట్టు చీరలు నేసిన చరిత్ర వారిది. అద్భుతమైన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి అందమైన చీరలు నేసే ఆ చేతులు నేడు మట్టి పని కోసం వెంపర్లాడుతున్నాయి. బతుకు కోసం తరతరాలుగా నమ్ముకున్న మగ్గానికి దూరమవుతున్నారు. కుటుంబ సభ్యుల కడుపు నింపేందుకు సిమెంట్, ఇటుకరాళ్లు మోసేందుకు పరుగులు పెడుతున్నారు. కులవృత్తిపై నమ్మకం వదిలి పరాయి వృత్తుల్లో కొందరు వంట పని, షెడ్డుల్లో లారీ క్లీనర్లుగా, కొందరు బారుల్లో సర్వర్లుగా, పెట్రోల్ బంకుల్లో రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారు. శ్రమకు తగ్గ మజూరీలు లేక పట్టణాల్లో కూలీలుగా తయారయ్యారు చేనేత కార్మికులు.

కూటమి పాలనలో దుర్భరం

చీరాలతోపాటు పొద్దుటూరు, ధర్మవరం, జమ్మలమడుగు, పెడన, ఐలవరం, బద్వేలు, ఆత్మకూరు, తాటిపర్తి వంటి ప్రాంతాల నుంచి 40 ఏళ్ల క్రితం వలసలు వచ్చిన కార్మికులు స్థానికంగా మాస్టర్‌వీవర్లకు సంబంధించిన చేనేత షెడ్డుల్లోని మగ్గాలపై పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బాపట్ల జిల్లాలో చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో సుమారు 15 వేల మగ్గాల వరకు ఉన్నాయి. 20 వేల చేనేత కుటుంబాల వారున్నారు. వీరిలో మొత్తం 50 శాతం మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరు బతుకులు మరింత దుర్భరంగా మారాయి. కనీస వేతనం కూడా దక్కడం లేదు.

న్యాయమైన డిమాండ్లు ఎన్నో..

చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించింది. రంగు, నూలు, రసాయనాలపై 29 శాతం జీఎస్టీ విధించడంతో చేనేత రంగం కోలుకోలేని దెబ్బతగిలింది. కూటమి ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించింది. సంక్షేమ పథకాలు అమలు కావడంలేదు. రూ.700 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే ప్రయోజనమని ఆవర్గం వాపోయింది. ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని కేంద్రం నిలిపివేసింది. ఈ పథకాన్ని కేంద్రం పునరుద్ధరించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన చేనేత ఆత్మహత్యలకు నేటికి ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు అందించలేదు. కూటమి ప్రభుత్వం వీటిని వెంటనే అందించాలని బాధితులు కోరుతున్నారు. చీరాలలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తానని గతంలో చంద్రబాబు ప్రకటించారు. దీనివలన చేనేతలకు ప్రయోజనం లేదు. దీనిని చేనేత పార్కుగా మార్చాలని కార్మికులు కోరుతున్నారు. ఆప్కో ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వమే ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేనేతల ద్వారా వస్త్రాలను నేయిస్తే ప్రయోజకరమని చెబుతున్నారు. కార్మికశాఖలో అవకాశం కల్పిస్తే కార్మికుల్లా ప్రయోజనాలు పొందుతారని పేర్కొన్నారు. చేనేత ప్రాంతాల్లో వారికి నూలు రాయితీపై ఇవ్వాల్సి ఉంది. తమిళనాడులోని చేనేత కార్మికులను ఆదుకునేలా పలు విధానాలు ఉన్నాయి. అవి ఇక్కడ అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం కొరవడింది.

ఉచిత విద్యుత్, నేతన్న నేస్తం అమలేదీ?

‘‘చేనేతలంటే నాకు చాలా ఇష్టం. వారి కష్టంతో కూడిన కళానైపుణ్యం ఉంది. వారికి అండగా నేనున్నా’’ అని సీఎం చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. అయితే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఇస్తామని చెప్పినా ఇంతవరకు అతీగతీ లేదు. కనీసం ఈ ఏడాదైనా ఇస్తారా? అని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

మరిన్ని నిధులు కేటాయించాలి

చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించింది. రంగు, నూలు, రసాయనాలపై 29 శాతం జీఎస్టీ విధించడంతో చేనేత రంగానికి కోలుకోలేని దెబ్బతగిలింది. కూటమి ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించింది. హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని నిలిపివేయడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం దీనిని పునరుద్ధరించాలి.

– దేవన వీరనాగేశ్వరరావు, చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

విఘ్నేశ్వరాయ.. వివిధ రూపాయ..!

చలువ పందిళ్లలో కొలువుదీరేందుకు గణనాథుడు సిద్ధమవుతున్నాడు. వినాయకచవితి పండుగకు వివిధ రూపాల్లో గణపయ్య చక్కగా ముస్తాబవుతున్నాడు. బోలో గణేశ్ మహారాజ్ కీ జై.. అనే భక్తుల నినాదాలతో ఆనందపడేందుకు కొలువుదీరబోతున్నాడు.



సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

- చవితికి సిద్ధమవుతున్న గణనాథులు
- వైవిధ్య ఆకృతుల్లో రూపొందిస్తున్న తయారీదారులు

బాపట్ల అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని బొజ్జ గణపయ్య విగ్రహాలు సిద్ధం అవుతున్నాయి. వినాయక రూపాలను తీర్చిదిద్దడంతో కళాకారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బాపట్ల పట్టణంలోని కర్లపాలెం రోడ్డులో మార్కెట్ యార్డు ఎదుట విగ్రహాల తయారవుతున్నాయి.

ఊరూవాడా పండగే..

వినాయక చవితి పండుగ సందర్భంగా ఊరూవాడా గణనాథుని విగ్రహాలు కొలువుదీర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి వీధిలో విగ్రహాలు ప్రతిష్ఠించి భజనలు, పూజలు చేసేందుకు భక్తులు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ఆకృతుల విగ్రహాలకు డిమాండ్ బాగా పెరిగింది. వీటి తయారీలో కళాకారులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మట్టి సేకరణ నుంచి రంగుల వరకు ఎంతో శ్రద్ధ పెడుతున్నారు. విగ్రహాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగిస్తారు. దీంతోపాటు పీచు, కర్ర, రంగులు కూడా వాడుతుంటారు. ఒక మాదిరి విగ్రహం తయారీకి సుమారు ఎనిమిది మంది దాదాపు వారం రోజులు పని చేస్తారు.

పెరిగిన ఖర్చులు

గతంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బస్తా రూ.150 ఉండేదని, ఇప్పుడు దాని విలువ రూ.300కు పెరిగిందని తయారీదారులు అంటున్నారు. విగ్రహాల తయారీని ఆరు నెలల ముందు నుంచే ప్రారంభిస్తామన్నారు. చవితి సమయానికిగానీ విగ్రహాలు విక్రయానికి సిద్ధం అవుతాయని తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు కొంత ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా కూలి గిట్టుబాటవుతుందని చెబుతున్నారు.



విగ్రహానికి రంగులు వేస్తున్న దృశ్యం

ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు



ఆరు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ ప్రారంభించాం. చాలా వరకు వివిధ ఆకృతుల్లో సిద్ధం చేశాం. కొనుగోలుదారులు ఇప్పుడిప్పుడే అడ్వాన్సులు ఇచ్చి వెళుతున్నారు. మొత్తం పది రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నాం.

– కటివరపు విజయ్ కుమార్, తయారీదారుడు

ధరలు బాగా పెరిగాయి



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ద్వారా విగ్రహాలు తయారీ చేస్తున్నాం. ఈ పని మాకు వంశపారంపర్యంగా వచ్చింది. వినాయక విగ్రహాలు తయారు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాల తయారీకి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్.అజయ్ కుమార్, తయారీదారుడు

‘ప్రైవేట్’ సహకారంతో వైద్య కళాశాల పనులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

బాపట్ల: వైద్య కళాశాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పూర్తి చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ తెలిపారు. బాపట్లలో సాయిగ్రాండ్‌లో బుధవారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో డిఫెన్స్ కారిడర్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ప్రపంచంలో దేశాన్ని ఒకస్థాయిలో నిలిపిన వ్యక్తి ప్రధాని మోదీ అని చెప్పారు. కేంద్ర నిధులతో పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలలో కార్యకర్తలు పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్రా వెంకట రామకృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి పులి కృష్ణారెడ్డి, జిల్లా మాజీ ఇన్‌చార్జి మణియాదవ్, నాయకులు కొండారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

క్లుప్తంగా

మహిళ మెడలో గొలుసు చోరీ

చీరాల: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని గొలుసును బైక్‌పై వచ్చిన దుండగులు అపహరించుకెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి చీరాలలో చోటుచేసుకుంది. బాపట్లకు చెందిన మేకల సుబ్బమ్మ ఆమె సోదరి భూలక్ష్మితో కలిసి చీరాల్లోని గొల్లపాలెంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. బాపట్ల వెళ్లేందుకు కూరగాయల మార్కెట్ వెనుకవైపు రోడ్డులో బ్రహ్మంగారి గుడి సమీపంలో వారిద్దరూ నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు సుబ్బమ్మ మెడలోని రెండున్నర సవర్ల బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. దీంతో నిర్ఘాంతపోయిన ఆమె కేకలు వేయడంతో వారు పరారయ్యారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

గుడిలో చోరీకి యత్నం

ఒకరిని పట్టుకున్న దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో అన్నపూర్ణమ్మతల్లి ఆలయంలో ఇద్దరు దొంగలు చోరీకి యత్నించగా గ్రామస్తులు వారిని వెంబడించి, వారిలో ఒకరిని పట్టుకున్నారు. అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ఇద్దరు వ్యక్తులు గుడిలోకి ప్రవేశించి సెల్‌ఫోన్ వెలుతురులో ఆలయంలో సంచరిస్తున్నారు. కరెంట్ పోవటంతో ఆలయం పక్కనే ఉన్న ఓ ఇంట్లోని వ్యక్తి బయటకు రాగా ఆలయంలో ఎవరో సంచరిస్తున్నట్లు గమనించి బిగ్గరగా కేకలు వేయటంతో దొంగలు పరారయ్యేందుకు యత్నించారు. వీరిలో ఒకరు గ్రామస్తులకు పట్టుబడటంతో పోలీసులకు అప్పగించారు. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతనిపై పలుచోరీ కేసులు ఉండటంతో మంగళగిరి పోలీసులకు అప్పగించారు. ఆలయంలో ఏ వస్తువులు చోరీకి గురికాకపోవటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కౌలు చెల్లు.. బతుకు ఘొల్లు!



బూదవాడలో దుక్కి దున్నుతున్న కౌలు రైతు

- ఏటా పెరుగుతున్న సాగు పెట్టుబడులు
- సీసీఆర్సీ కార్డులు అందించని ప్రభుత్వం
- అందని రాయితీలు, రుణాలు
- సంకట స్థితిలో కౌలు రైతులు

జె.పంగులూరు: కౌలు రైతులను కష్టాలు వీడడం లేదు. సెంటు భూమి లేకపోయినా సేద్యాన్ని నమ్ముకొని పంటలను సాగుచేస్తునే ఉన్నా ఏటికేడు పెట్టుబడులు పెరుగుతూనే ఉండటంతో కౌలు రైతులు చేతులెత్తేస్తున్నారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వేసిన మినుము, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం హడావిడిగా అధికారులతో పంట నష్ట పరిహారం అంచనా వేయించింది. నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపింది. కానీ ఇంత వరకు పంట నష్టపరిహారం అందిన దాఖలాలు లేవు. జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

పడిపోయిన కౌలు సాగు

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం కౌలు రైతులు పూర్తిగా తగ్గిపోయారు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక, రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. దీంతో కౌలు రైతులు పంట పొలాలు కౌలుకు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది మండలంలో ఎకరా కౌలు రూ.15 వేల నుంచి రూ. 20 వేలు పలుకుతోంది. గత సంవత్సరం ఎకరా కౌలు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ధర పలకడం గమనార్హం. కానీ వేసిన పంట అమ్ముడుపోక కౌలు రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. ప్రభుత్వాల నుంచి సాయం అందక, సాగు వ్యయంతో పాటు కౌలు ధరలు పెరగడంతో కూలీలుగా మారడమే నయం అని దుఃఖిస్తున్నారు.

భూ యజమానులతో తంటా

అధికారులు హడావిడి చేసి కౌలు రైతుల గుర్తింపు కార్డులు తీసుకోమని చెప్పడమే గానీ.. రైతులకు గుర్తింపు కార్డులు అందించడం లేదు. కౌలు రైతు చట్టంలో వీరికి అన్యాయం జరుగుతోంది. సీసీఆర్ కార్డులన్నా ఉంటే వీరికి కాస్త ప్రయోజనం ఉండేది.. అయితే ఈ కార్డులు ఇవ్వాలంటే భూ యజమానులు సంతకం కావాల్సి ఉండడంతో, యజమానులు అందుకు ఒప్పుకోకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రభుత్వం నుంచి సాయం అందక.. యజమానుల తీరుతో కార్డులు దక్కక.. ఇటు బ్యాంకుల్లో అప్పులు పుట్టకపోవడంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని కౌలు వాపోతున్నారు.

ప్రభుత్వం కౌలు రైతులను విస్మరించింది



కూటమి ప్రభుత్వం కౌలు రైతులను పూర్తిగా విస్మరించింది. గుర్తింపు కార్డులు లేకపోవడంతో రైతులు పండించిన పంటను అమ్ముకునే పరిస్థితులు లేవు. ఈ సంవత్సరం ప్రభుత్వం పొగాకు వేయవద్దని చెబుతోంది. మొక్కజొన్న, మినుము పంటలు అధికంగా వేసే అవకాశం ఉంది. కేంద్రం ప్రభుత్వం ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకుంటుంది. తద్వారా పంటలకు గిట్టుబాట ధర వచ్చే అవకాశం కనిపించడం లేదు.

– తల్లపనేని రామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రుణాలు అందడం లేదు



ఏటా పెట్టుబడులు అధికంగా పెరుతూ కౌలురైతులు అప్పుపాలవుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. జిల్లాలో పంటలు పండిస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే. గత రెండు సంవత్సరాల నుంచి అప్పులు తేలడంతో ఈ సంవత్సరం కౌలు రైతులు పంటలు వేసేందుకు ముందుకు రావడంలేదు.

– రాయిణి వినోద్‌బాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పెరుగుతున్న పెట్టుబడులు



ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. అప్పులే మిగులుతున్నాయి. గత సంవత్సరం 3 ఎకరాల్లో మినుము పంట వేశా. పంట కోతకు వచ్చే సమయానికి అకాల వర్షాలతో పంట మొత్తం పాడైపోయింది. అధికారులు అంచనా వేశారు గానీ.. నష్టపరిహారం ఒక్క రూపాయి కూడా అందించలేదు. రైతులంతా సిమెంటు పనికి పోతున్నారు. నేను గతంలో 7 ఎకరాలు తీసుకున్నాను. ఈ సంవత్సరం రెండు ఎకరాలు మాత్రమే కౌలుకు తీసుకున్నా.

– ఆనందరావు, కౌలు రైతు

జిల్లాలో నాలుగు 'ఆటిజం' కేంద్రాలు

- ఒక్కో కేంద్రానికి రూ. 27.75 లక్షలు మంజూరు
- జిల్లా సహిత విద్యా సమన్వయకర్త జ్యోత్స్న

అద్దంకి: ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమం కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త జ్యోత్స్న అన్నారు. స్థానిక అద్దంకి సత్రం బడి ఆవరణలో బుధవారం ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలెంకో సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, కొరిసపాడు, జె.పంగులూరు, సంతమాగులూరు మండలాల్లోని ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అలింకో సంస్థ ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణను అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 4 మున్సిపాలిటీలకు ఆటిజం సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో ఆటిజం సెంటర్‌కు రూ. 27.75 లక్షలు మంజూరయ్యాయన్నారు. అద్దంకి మున్సిపాలిటీలో సత్రంబడి ఆవరణలో ఆటిజం కేంద్రం నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం కాన్పూర్ అలెంకో సంస్థ నుంచి వచ్చిన వైద్యులు ప్రియా వర్మ, తుషార్ వర్మ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అర్హులకు వారికి తగిన ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. బల్లికురవ ఎంఈఓ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు యం.ధనలక్ష్మి, జె.బాబురావు, కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

పెన్షన్ ఇవ్వాలంటూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఆదేశాలు

మార్టూరు: కలెక్టర్ ఆదేశించినా మార్టూరు ఎంపీడీఓ, కోనాకి పంచాయతీ కార్యదర్శులు తమకు పెన్షన్ ఇవ్వని విషయమై బాధితులు బుధవారం విజయవాడలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మార్టూరు మండలం కోనాకి గ్రామానికి చెందిన చర్మ.. డప్పు కళాకారులైన తాళ్లూరి అచ్చయ్య, అమరయ్యలకు గత ప్రభుత్వ హయాం నుంచి వస్తున్న పెన్షన్‌ను ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నక్క సుధాకర్‌లు అకారణంగా ఈనెలలో నిలిపివేశారు. ఈ విషయమై బాధితులు గత సోమవారం బాపట్లలో గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదు చేయగా.. ఆయన ఎంపీడీఓకు ఫోన్ చేసి పెన్షన్ ఇవ్వాలని ఆదేశించారు. అయినా ఎంపీడీఓ బేఖాతరు చేశారు. ఈ క్రమంలో బాధితులు బుధవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్న జవహర్.. తాళ్లూరు అచ్చయ్య, అమరయ్యలకు తక్షణమే పెన్షన్ ఇప్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు బుజ్జి మాదిగ పాల్గొన్నారు.



విజయవాడలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు తాళ్లూరి అచ్చయ్య, అమరయ్య

దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

మేదరమెట్ల: ఈనెల 4వ తేదీన మేదరమెట్ల బస్టాండ్ ఆవరణలో యానాది వర్గానికి చెందిన మహిళపై దాడి చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య బుధవారం డిమాండ్ చేశారు. మేదరమెట్ల బస్టాండ్‌లో బాపట్ల భువనేశ్వరి, చెంచుకుమారి, కృష్ణవేణిలు మరుగుదొడ్లు శుభ్రం చేస్తుండగా.. ఆ సమయంలో సోమవరప్పాడుకు చెందిన గోలి అజయ్, తన తల్లితో కలిసి వచ్చి భువనేశ్వరిపై దాడి చేశాడన్నారు. అడ్డువచ్చిన చెంచుకుమారి, కృష్ణవేణిని కూడా వాతలు పడేలా కొట్టారని.. మీరు మేదరమెట్లలో ఉండరంటూ బెదిరించారని బాధితులు వాపోయారు. మేదరమెట్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకుండా, తాత్సారం చేస్తున్నట్లుగా బాధితులు తెలిపారు. రెండు రోజుల్లో కేసు లేకుండా ఉండేందుకు గాను రాజీకి యత్నించారన్నారు. ఈ విషయం దళితహక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలంనాగేంద్రానికి తెలియడంతో ఆయన ఎస్పీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే సాధారణ సెక్షన్‌తో మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. మహిళలను కొట్టిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ బుధవారం యానాది సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ, జీవరత్నం బాధితులతో కలిసి మేదరమెట్ల పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.



మేదరమెట్ల పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బాధిత మహిళలతో యానాది సంఘం, మాలమహానాడు నేతలు

క్రైస్తవులపై అక్రమ కేసుల ఎత్తివేతకు డిమాండ్

గుంటూరులో క్రైస్తవ సంఘాల భారీ శాంతి ర్యాలీ

నెహ్రూనగర్: చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్‌లను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిపై అక్రమ కేసులను ఎత్తివేయాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు క్రైస్తవ, దళిత, బహుజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడుల పేరుతో సిస్టర్లను అన్యాయంగా అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇలాంటి దాడులపై ఐక్యంగా ఉంటూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బలవంతపు మత మార్పిడి ఎవరూ చేయరని, సమాజంలో అట్టడుగువర్గాల అభివృద్ధికి క్రైస్తవ మతం కృషి చేస్తుందన్నారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జె విద్యాసాగర్ మాట్లాడుతూ దేశంలో దశాబ్దాలుగా క్రైస్తవులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వారు కూడా భారతీయులేనని గ్రహించలేని స్థితిలో మతోన్మాదులు ఉన్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు.



శాంతి ర్యాలీలో గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, క్రైస్తవులు

అశోక్‌బాబు దీక్ష ఫలితం.. రైతన్నల హర్షం

కొనసాగుతున్న కాల్వల పూడికతీత పనులు



పొక్లెయిన్‌తో అద్దేపల్లి నుంచి కనగాల అప్లాండ్ - గూడవల్లి గంగోలు కాల్వలో పేరుకుపోయిన కంప, గుర్రపుడెక్క, తూటికాడ తొలగిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి నుంచి కనగాల అప్లాండ్ – గూడవల్లి గంగోలు కాల్వలో పేరుకుపోయిన చెట్లు, గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు చర్యలు గురువారం కూడా కొనసాగాయి. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు అకుంఠిత దీక్షతో యుద్ధ ప్రాతిపదికన మురుగు నీటి కాల్వ పనులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు రైతన్నల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన అశోక్‌బాబు దీక్ష ఫలితమే రైతుల పాలిట వరంగా మారింది. ఎన్నో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించింది.

ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఢీ

- తప్పిన పెను ప్రమాదం
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ప్రమాదానికి కారణమైన బస్సులు

కారంచేడు: ఎదురెదురుగా వస్తున్న రెండు బస్సులు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ సంఘటన వాడరేవు – పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో చీరాల – కారంచేడు మధ్య ఉన్న చినచప్టాల సమీపంలోని మలుపు వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, ప్రయాణికుల కథనం మేరకు.. చీరాల ఆర్టీసీ డిపోకి చెందిన హైయర్ బస్సు చీరాల నుంచి నరసరావుపేటకు వెళుతోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి చీరాలకు వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వేగంగా వస్తూ చినచప్టాల సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో సుమారు 40 మందికి పైగా ప్రయాణికులున్నట్లు సమాచారం. వీరిలో కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి రెండు బస్సుల అద్దాలు పగిలిపోయాయి. ఆర్టీసీ హైయ్యర్ బస్సు రోడ్డు పక్కన తుమ్మ చెట్లలోకి వెళుతుండగా డ్రైవర్ చాకచక్యంతో నిలిపారు. లేకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు తెలిపారు. కారంచేడు ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

దురుద్దేశంతోనే కొన్ని స్థానాలకు ఎన్నికలు

- ధైర్యముంటే రాష్ట్రంలోని అన్ని ఖాళీ జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలి
- పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యానికి కుట్రలు
- వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భవనం శ్రీనివాసరెడ్డి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో కడప జిల్లాలోని రెండు జడ్పీటీసీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలు పెట్టిందని పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భవనం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. దురుద్దేశంతోనే ప్రత్యేకించి పులివెందులలో ఎన్నికలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో ఉన్న అన్ని ఖాళీస్థానాలకు ఎన్నికలు పెట్టి సత్తాచాటాలన్నారు. ఆ ధైర్యంలేక అధికారం అడ్డుపెట్టి కొన్నింటికి ఎన్నికలు పెట్టడం ప్రజాస్వామ్యం కాదన్నారు. ఏడాది పూర్తికాకుండానే ప్రభుత్వంపై ప్రజల్లోకి తీవ్ర వ్యతిరేకత ఉన్న విషయం అధికార పార్టీ నాయకులకు తెలుసన్నారు. కేవలం కడప జిల్లాలో రెండు ఎన్నికలు పెట్టి పోలీసులను అడ్డుపెట్టి దౌర్జన్యంతో గెలవాలని చూస్తున్నారని, అది కలలో కూడా సాధ్యం కాదన్నారు. అధికారం ఉందని టీడీపీ వారు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలన్నారు.

బంగారం, వెండి ఆభరణాలు చోరీ


బల్లికురవ: ఇంటి వెనుక భాగంలో నుంచి దొంగలు ప్రవేశించి బీరువాలో ఉంచిన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటన మేదరమెట్ల – నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరగ్గా బుధవారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటుపల్లి గురుమూర్తి, ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులతో వరండాలో నిద్రిస్తున్నారు. దొంగలు పథకం ప్రకారం ఇంటి లోపలికి ప్రవేశించి బీరువా తాళాలు తెరిచి 3 సవర్ల బంగారు ఆభరణాలు, 30 తులాలు వెండి ఆభరణాలు, రూ. 1500 నగదు చోరీ చేశారు. ఆభరణాల విలువ రూ. 6 లక్షల పైన ఉంటుందని బాధితుడు తెలిపాడు. బుధవారం ఉదయం నిద్రలేచిన గురుమూర్తి కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు, బీరువా తలుపులు తెరచి ఉండటం చూసి, చోరీ జరిగినట్లుగా గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంతమాగులూరు సీఐ కె.వెంకటరావు, ఎస్‌ఐ వై.నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. ప్రధాన రహదారి పక్కనే దొంగతనం జరగటంపై గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



రామాంజనేయపురంలో చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కూటమికి బీసీలు అంటే అంత అలుసా?

- కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీలను భయభ్రాంతులకు గురి చేయడానికే హత్యాయత్నాలు, అక్రమ అరెస్టులు
- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్



ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నివాసంలో మాట్లాడుతున్న నాయకులు

పెదకాకాని: కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. పెదకాకానిలోని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి నివాసంలో బుధవారం మండల ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలే పార్టీకి వెన్నుముక అని ప్రచారం చేసే కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. మూడు సంవత్సరాల కిందట జరిగిన జలకళ పథకంలో అక్రమాలు జరిగాయని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావుకు గిట్టని వారితో ఫిర్యాదు చేయించి అరెస్టు చేయించడం ముమ్మాటికీ రాజకీయకక్షే అన్నారు. ఈనెల 3వ తేదీన ఓ దినపత్రికలో సీనియర్ ఎమ్మెల్యేపై ఆ ఎమ్మెల్యే దందాలతో దడ అని ప్రచురణ కావడంతో సీనియర్ ఎమ్మెల్యే ఎవరబ్బా అని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు సందిగ్ధంలో ఉన్నారన్నారు. అదే సమయంలో ఆ ఎమ్మెల్యే ఎవరో ఆ పార్టీ నాయకులే విలేకరుల సమావేశం పెట్టడం, అదే పత్రికతో పాటు పలు పేపర్లలో ఈనెల 5వ తేదిన తక్కెళ్ళపాడు కల్యాణ మండపం వ్యవహారంలో ఎమ్మెల్యే నరేంద్ర తప్పేంలేదని ప్రచురించడం చూస్తే ఆ సీనియర్ ఎమ్మెల్యే ఎవరో సమాజానికి స్పష్టంగా తెలియజేశారన్నారు. ఈ వ్యవహారంపై ప్రజల ఆలోచన, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చను ప్రక్కదారి పట్టించడానికే కూటమి ప్రభుత్వం ఎంపీపీని ఒక పథకం ప్రకారం అరెస్టు చేయించిందన్నారు. గతంలో అనుమర్లపూడిలో జరిగిన సంఘటన రోజు నుంచి ఎంపీపీపై ఎమ్మెల్యే కక్ష పెంచుకున్నాడని ఆరోపించారు. కేవలం రాజకీయకక్షతోనే ఎంపీపీని అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. ఇటీవల కాలంలో పొన్నూరు రూరల్ మండలం, మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావును కూడా రాజకీయ కక్షతో హత మార్చేందుకు ఎమ్మెల్యే అండదండలతో హత్యాయత్నం చేశారన్నారు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసిలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లయదుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.